నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 1 మే 2024 | YADADRI BHUVANAGIRI

## పదో తరగతిలో 90.44 శాతం ఉత్తీర్ణత

- ఫలితాల్లో బాలుర కంటే బాలికలదే పైచేయి
- 9,108మంది విద్యార్థులకు 8,237 మంది పాస్
- గత సంవత్సరం కంటే 9.5 శాతం పెరుగుదల
- 25వ స్థానంలో నిలిచిన జిల్లా

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : రాష్ట్ర విద్యాశాఖ మంగళవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా 25వ స్థానంలో నిలిచింది. మొత్తం 9,108 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 8,237 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై జిల్లాలో 90.44 శాతంగా నమోదైంది. ఇందులో 4,571 మంది బాలురకు 4,032 మంది ఉత్తీర్ణత సాధించగా 88.21శాతం, 4,537 మంది బాలికలకు గానూ 4,205 మంది ఉత్తీర్ణులై 92.68 శాతంగా నమోదయ్యారు. జిల్లాలో గత సంవత్సరం కంటే ఉత్తీర్ణత శాతం 9.5 పెరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలోని 31 ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపీఏ సాధించగా.. ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 68 పాఠశాలల్లో 10 జీపీఏ సాధించినట్లు వెల్లడించారు.


యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

# పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

**బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం ఎవరి తరం కాదు**

- ప్రజలు కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేకపోతున్నరు
- అత్యధిక ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్‌దే గెలుపు
  మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- మునుగోడు నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు
- క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు

మర్రిగూడ/ చండూరు, ఏప్రిల్ 30 : అనతి కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సహా కొందరు కాంగ్రెస్ దద్దమ్మలు మాట్లాడుతున్నారని, అది ఎవరి తరం కాదని పేర్కొన్నారు. మర్రిగూడ, చండూరు మండల కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించడం చేతగాక శ్వేతపత్రాలు, కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్ అంటూ 3నెలలు కాలయాపన చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతన్నలు, ప్రజలు కరువుతో అల్లాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, అన్న వస్త్రానికి వెళ్తే ఉన్న వస్త్రం పోయిందన్న సామెతగా మారిందని ప్రజలు గుర్తించారని అన్నారు. తెలంగాణను బతికించేది కాళేశ్వరం ప్రాజెక్టు అని, కుంగిపోయిన పిల్లర్లకు, ఎత్తిపోతలకు సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చూడలేక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి శంఖారావం పూరించారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కేసీఆర్ కూతురు కవితను జైలులో పెట్టినా.. కుంగిపోకుండా ప్రజల బాధలు తీర్చేందుకు బస్సు యాత్ర చేపట్టారన్నారు. బస్సు యాత్రకు లక్షలాది మంది ప్రజలు నీరాజనం పలుకుతుండటంతో కాంగ్రెస్, బీజేపీకి వణుకు మొదలైందని, ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిందని తెలిపారు. 16 ఎంపీ స్థానాలు గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయిన కొన్నాళ్లకే కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీని వీడుతున్నారని, అలాంటి వారిని భవిష్యత్‌లో తిరిగి పార్టీలో చేర్చుకునేది లేదని తేల్చి చెప్పారు. నాయకులను తయారు చేయడం బీఆర్ఎస్‌కు కొత్త కాదన్నారున. బడుగు, బలహీన వర్గాల అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.


చండూరులో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల, భిక్షమయ్యగౌడ్

### కార్యకర్తలకు అండగా ఉంటా : క్యామ

భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తనకంటే గొప్ప ఏమీ కాదని, భువనగిరిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందరికీ తాను అందుబాటులో ఉంటానని, బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం తనకు ఉన్నదని, ఇప్పుడున్న మంత్రులు తనకంటే గొప్పేమీ కాదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న వారికి ఎంపీ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ వీడుతున్న ఒకరిద్దరితో ఎలాంటి నష్టం లేదని, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదిరించి ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే సత్తా ఒక్క బీఆర్ఎస్‌కే ఉన్నదన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సమావేశాల్లో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతిరెడ్డి, పల్లె రవికుమార్, మునగాల నారాయణరావు, వెంకటేశ్వర్‌రావు, ఎంపీ ఎన్నికల నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకటనారాయణ గౌడ్, చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, ఎంపీపీ అవ్వారి గీత, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఇన్‌చార్జి ఎంపీపీ కట్కూరి వెంకటేశ్ గౌడ్, నాయకులు గుర్రం వెంకట్‌రెడ్డి, మెండు మోహన్‌రెడ్డి, అనంత రాజు గౌడ్, రామకృష్ణ, వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


చండూరు సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# ధాన్యం కొనుగోలు కోసం రోడ్డెక్కిన రైతన్న

- యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- రోడ్డుపై ట్రాక్టర్లు పెట్టి ధాన్యం కింద పోసి నిరసన

వలిగొండ, ఏప్రిల్ 30 : ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అధికారులు, మిల్లర్లు కలిసి కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలిచిపోవడంతో కడుపు మండిన వలిగొండ మండలంలోని సంగెం, వర్కట్‌పల్లి గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా రైతులు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట కింద పోసి ఆందోళన చేపట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కదంతొక్కి ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లను నిలిపివేశారని, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలంటే రైతుల నుంచి లారీ యజమానులు బస్తాకు రూ.5 అదనంగా డిమాండ్ చేస్తున్నారని వాపోయారు.

మిల్లర్లు తాలు, తరుగు పేరుతో 5 కిలోలు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ-గ్రేడ్ ధాన్యాన్ని మిల్లుల వద్దకు రాగానే బీ-గ్రేడ్ ధాన్యంగా మారుస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, అధికారులు బయటకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో పోలీసులు రంగప్రవేశం చేయడంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వెనక్కి తగ్గలేదు. దీంతో రెండు వైపులా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అనంతరం పలువురు రైతులు కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు.

### అధికారులు, మిల్లర్లు కలిసి ముంచుతుండ్రు



ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను నిండా ముంచుతుండ్రు. మార్కెట్లో వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. లారీ యజమానులు బస్తాకు 5 రూపాయలు డిమాండ్ చేస్తుండ్రు. మిల్లర్ల చేతిలో అధికారులు కీలుబొమ్మలుగా మారిండ్రు. ప్రభుత్వానికి, అధికారులకు రైతుల గోస పట్టడం లేదు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి. లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

–సోలిపురం జనార్దన్‌రెడ్డి, రైతు, వర్కట్‌పల్లి, వలిగొండ మండలం

### వడ్లు కొనక వారమైంది..




లారీలు రాక వారం రోజులుగా మార్కెట్లో ధాన్యం కొనుగోళ్లు జరుగలేదు. లారీ యజమానులు బస్తాకు 5 రూపాయలు అడుగుతుండ్రు. అధికారులు మొక్కుబడిగా వచ్చిపోతుండ్రు గానీ ధాన్యం మాత్రం కొంటలేరు. మిల్లర్ల చేతిలో అధికారులు కీలుబొమ్మగా మారారు. ధాన్యం లోడ్లతో వెళ్లిన లారీలను మిల్లుల వద్ద ఏరోజుకు ఆరోజు ఖాళీ చేయించేలా చర్యలు చేపట్టాలె. అధికారులను అడిగితే మిల్లర్ల మీద, మిల్లర్లను అడిగితే అధికారుల మీద నెపం వేస్తూ కాలయాపన చేస్తుండ్రు.

–జక్కల వెంకటేశ్, రైతు, సంగెం, వలిగొండ మండలం

# భువనగిరి ఓటర్లు @18,08,585

- తేలిన పార్లమెంట్ ఓటర్ల వివరాలు
- పురుషుల కంటే స్వల్పంగా మహిళలు అధికం
- సగం మందికి పైగా 40ఏండ్లలోపు వారే
- వందేండ్ల పైబడినోళ్లు 180 మంది
- ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా ఓటర్లు



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంత మంది ఓటర్లు అనే వివరాలను రిటర్నింగ్ అధికారి హన్మంతు కె.జెండగే వెల్లడించారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,08,585 ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 8,98,416మంది పురుషులు, 9,10,090 మంది స్త్రీలు, 79 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 3,39,341మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత మునుగోడులో 2,57,557, భువనగిరిలో 2,20,596, నకిరేకల్‌లో 2,53,785, తుంగతుర్తిలో 2,59,265, ఆలేరులో 2,35,270, జనగాంలో 2,42,771 ఓటర్లు ఉన్నారు.

**వయసు వారీగా ఓటర్లు**

| వయసు | ఓటర్లు |
|---|---|
| 18-19 | 61,813 |
| 20-29 | 3,87,893 |
| 30-39 | 4,79,619 |
| 40-49 | 3,52,333 |
| 50-59 | 2,50,391 |
| 60-69 | 1,62,402 |
| 70-79 | 87,809 |
| 80-89 | 23,164 |
| 90-99 | 2,991 |
| 100-109 | 143 |
| 110-119 | 14 |
| 120+ | 23 |
| మొత్తం | 18,08,585 |

### 40 ఏండ్లలోపు 9,29,325 ఓటర్లు

పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఓటర్లలో సగం మందికి పైగా యువ ఓటర్లే ఉన్నారు. 40 ఏండ్లలోపు 9,29,325 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇక 40 నుంచి 99 ఏండ్లలోపు 8,79,090 మంది ఓటర్లు ఉన్నారు. ఇక వందేండ్లకు పైగా 180 మంది ఉన్నారు. ఇందులో వంద నుంచి 109 ఏండ్ల మధ్య 143 మంది, 110 నుంచి 119 మధ్య 14 మంది, 120కి పైగా 23 మంది వృద్ధులు ఉన్నారు. వృద్ధుల ఓటు నమోదు కోసం ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వండి
- ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి


మగ్దుంపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని కోరారు. రుణమాఫీ చేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మరోసారి నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దని సూచించారు. కొంతమంది నాయకులు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టం లేదన్నారు. కార్యకర్తల బలం ఏమిటో నిరూపించుకునే సమయం ఆసన్నమైందన్నారు. మే 13న 420 మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి నెలకొందన్నారు. మన హక్కులు మనకు దక్కాలన్నా, న్యాయంగా నిధులు రావాలన్నా బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు దాటినా ఎందుకు రైతుబంధు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. ఏ నియోజకవర్గానికి వెళ్లినా రైతులు, ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగు, తాగునీటితోపాటు 24 గంటల ఉచిత కరెంట్, సకాలంలో రైతుబంధు, జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి గోలి సంతోష్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, చెంగలి కిషన్‌రావు, గుంటిపల్లి లక్ష్మీనారాయణ, ఆకుల ప్రభాకర్, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే


మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 30 : మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే సూచించారు. భువనగిరి నియోజకవర్గ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 61 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో 10 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, మరో 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, మిగతా 39 మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. వీరి కోసం 3 ఈవీఎంలను ఉపయోగించనున్నట్లు చెప్పారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల వ్యయం నమోదుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 18,08,585 ఓటర్లు ఉన్నారని, వీరిలో 8,98,416 మంది పురుషులు, 9,10,090 మంది స్త్రీలు, 79 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శక ఎన్నికల నిర్వహణకు 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో స్టాటిస్టికల్ సర్వే లెన్స్, వీడియో సర్వే లెన్స్, వీడియో వీవింగ్ టీమ్‌ల ద్వారా నిబంధనలకు లోబడి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 245 మంది సెక్టార్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని, ఒక సెక్టార్ అధికారి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఇప్పటివరకు రూ.9,43,17,069 విలువైన మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, డబ్బు పట్టుబడినట్లు చెప్పారు. సువిధ ద్వారా ఆన్‌లైన్ అనుమతులు పొందాలని, ఆఫ్‌లైన్ అనుమతి కోసం సహాయ రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలని, ప్రతి ఒక్కటీ ఎన్‌కోర్‌లో నమోదవుతుందని తెలిపారు. సి-విజిల్ యాప్‌ను అందరూ వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమాళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేయాలని, 1950 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి అక్కడే డిస్ట్రిబూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, జూన్ 4న భువనగిరి పట్టణంలోని అరోరా కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. జిల్లాలోని 816 పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 6 ఎంసీసీ ఉల్లంఘన కేసులు నమోదు చేశామని, 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈవీఎంల భద్రత, కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, మైక్రో అబ్జర్వర్ల పరిశీలన ఉంటుందన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ పాల్గొన్నారు.

